# ఓ సినిమా కథ

బలిజేపల్లి

**ఒకవూళ్ళో** ఓ సుబ్బారావు ఉన్నాడు. సుబ్బారావు పేర్లు విరివిగా లభిస్తూ సుబ్బారావు లేని పేటలు అరుదుగా ఉన్న ఆంధ్రదేశంలో ఒక ఊళ్ళో ఓ సుబ్బారావే ఉన్నాడంటే ఆశ్చర్యమే మరి! కానీ, నిజానికి ఆ సుబ్బారావు కూడా ముందు కనపడలేదు. అయితే, కొత్త బాటరీలు నింపిన టార్చిలైటుతో ఊరంతా వెదుకుతుంటే ఒక చోట టార్చిలైటు తెల్లని కాంతి పతనమైంది కానీ, తిరిగి పరావర్తనం చెందలేదు. ఏమిటా అని ఆశ్చర్యంగా చూస్తే అక్కడ ఒక నల్లని అవతారం రాస్తూ కనిపించింది. ఏమి టని విచారించగా అది సుబ్బారావుదని తెలిసింది. అప్పుడు నా ఆనందానికి అవధుల్లేవు. వెంటనే 'యురేకా' అని అరిచేశాను.

విచిత్ర మేమిటంటే, సుబ్బారావు నా అరుపుకి ఉలిక్కి పడలేదు. ఏమి టన్నట్లు ఆశ్చర్యంగా చూడలేదు. అసలు నన్ను ఏమాత్రం పట్టించుకోకుండా తాపీగా తన వీపుని గోడకి చేర్చి అటూ, ఇటూ రాయడంలో నిమగ్నమైపోయాడు. ఆ స్థితిలో అతణ్ణి చూడగానే నా కెందుకో అతని గురించి తెలుసుకోవాలనిపించి వివరాలు సేకరించాను.

సుబ్బారావు ఒక సామాన్య కుటుంబీకుడు. కడుపు నిండా తిండి లేదు కానీ, ఒంటినిండా మురికి నిండి ఉంది. ఆ మురికి వల్ల అతనికి దురద పుట్టింది. రాను రాను కడుపులో ఆకలి బాధ కన్నా ఒంటిమీద దురద బాధే ఎక్కువయిపోయింది. దానితో అతడు వాడిన సబ్బు వాడకుండా ఉన్న సబ్బు లన్నీ వాడేశాడు. అంతేకాదు. ఒక్కొక్క సబ్బునీ వారం రోజులపాటు విడవకుండాకూడా వాడి చూశాడు. ఏం చేసినా అతని దురద తీరలేదు.

కొంత కాలానికి అతని దురద తీరకపోగా పెరిగిపోవడానికి కారణం సబ్బులు వాడటమేనని తెలుసుకున్న సుబ్బారావు సబ్బులు పూర్తిగా వాడటం మానేశాడు. మళ్ళీ పూర్వం వాడిన కుంకుడుకాయలే వాడటానికి నిర్ణయించుకున్నాడు. కానీ, అతని కెక్కడా కుంకుడుకాయ మచ్చుకికూడా కనిపించలేదు. దానితో అతడు స్నానం చేయడమే పూర్తిగా మానేసి రోజూ మూడు సంధ్యల్లోనూ గోడకి వీపు చేర్చి అటూ, ఇటూ రాయడం అలవాటు చేసుకున్నాడు.

అలాంటి సుబ్బారావు ఓసారి ప్రేమలో పడ్డాడు. ఎవరో పరాయి వాళ్ళ ప్రేమలో కాదు. సొంత మేనత్త కూతురు ప్రేమలో పడ్డాడు. పడి ఊరుకోలేదు. ప్రేమ గీతాలు ఆలపించాడు. అంతటితో ఊరుకోకుండా ఓ చల్లని సాయంకాలం ఎవరూ లేకుండా చూసి సినిమాలో హీరోలా మరదలి చెయ్యి పట్టుకున్నాడు. అంతే! అతని చెంప ఛెళ్ళుమంది. ఎందుకంటే, అదే సమయంలో అతని చెంపమీద దోమ వాలింది. పాపం! సుబ్బారావు మరదలు దాన్ని చంపబోయి అతని చెంప ఛెళ్ళుమనిపించింది. ఆ దెబ్బతో దోమ చావలేదు. కానీ, సుబ్బారావు మనసు చచ్చిపోయింది. ప్రేమ పటాపంచలయిపోయింది. హృదయం అవమానంతో కుంగిపోయింది. వెంటనే హీరోలాంటి మనిషి విలన్‌లా మారిపోయాడు. "ఛీ! మీ ఆడవాళ్ళందరూ ఇంతే! ప్రేమించకపోతే కఠినాత్ముడు, దుర్మార్గుడు అంటారు. ప్రేమించి దరి చేరితే అలుసు చేసి నెత్తిమీద పులుసు పోస్తారు. మిమ్మల్ని నమ్మేకంటే ఏ రాయినో రప్పనో నమ్ముకుంటే మంచిది" అంటూ నోటికి వచ్చిన మాటలు దులిపేసి మరదలు చెప్పబోయేదికూడా వినకుండా, వెనక్కి తిరిగి చూడకుండా వెళ్ళిపోయాడు.

ఆ హఠాత్సంఘటనతో సుబ్బారావు మరదలు కుప్పలా కూలిపోయింది. మనసు రప్పలా మారిపోయింది. కంటి రెప్పలనే ఆర్పడం మానేసింది. అక్కడే గోడకు వేలాడుతున్న దేవుడి ఫోటోని తీక్ష్ణంగా చూడటం మొదలు పెట్టింది. 'తన బావ తనని అపార్థం చేసుకోవడానికి కారణం నువ్వే' అంటూ దేవుణ్ణి శాపనార్థాలు పెట్టింది. ఆ సమయంలో ఫోటోమీద దోమ వాలింది. కానీ, ఆమె దాన్ని పట్టించుకోకుండా ఫోటోవంక ఇంకా తీక్షణంగా చూడటం మొదలు పెట్టింది. దానితో పెద్ద గాలి దుమారం బయల్దేరింది. ఆకాశంలో మేఘాలు ఒక్కసారిగా ముసురుకున్నాయి. మెఱుపులతో, ఉరుములతో ఆకాశం దద్దరిల్లిపోయింది.

క్రోధన ఉగాది హాస్య కథల పోటీలో
ప్రత్యేక బహుమతి పొందిన కథ



బలిజేపల్లి వెంకట సత్యనారాయణమూర్తి పాతిక సంవత్సరాల క్రితం తూ.గో.జిల్లా రాజోలు తాలూకా మొండెపులంక గ్రామంలో జననం. బి.యస్సి. డిగ్రీ పూర్తి చేసి ప్రస్తుతం గుత్తి రైల్వే డీజల్ లేబొరేటరీలో జూ.కెమికల్ అండ్ మెటలర్జికల్ అసిస్టెంట్‌గా ఉన్నారు.

రచనలలో ప్రకృతికి ప్రాముఖ్య మివ్వాలన్నది వీరి ఆశయం.

గోడమీద ఫోటో గడియారంలో లోలకం లాగా అటూ, ఇటూ ఊగిపోయి, గోడనుండి ఊడిపోయి కింద పడిపోయింది. సరిగ్గా అదే సమయంలో గడియారం గంట కొట్టింది. ఆకాశవాణి గొంతు చించుకొని అరిచింది. (ప్రేమ) తీర ప్రాంతాల వాళ్ళు తమ తమ ప్రాంతాలను ఖాళీ చేసి వెళ్ళవలసిందిగా హెచ్చరిక చేసింది.

ఆకాశవాణి హెచ్చరిక విని సుబ్బారావు మరదలు లేచి నిలబడింది. జుట్టు విరబోసుకుంది. తను కూలబడిన ప్రాంతాన్ని ఖాళీ చేసి సముద్రం వేపు విసవిసా నడుచుకుంటూ వెళ్ళిపోయింది. మధ్యలో రైలుపట్టాలు కనిపించాయి కానీ, అక్కడ ఆగలేదు.

మరదలిమీద కోపంతో విసురుగా వెళ్ళిపోయిన సుబ్బారావు కొంత దూరం వెళ్ళిన తరవాత ఆకాశాన్ని చూసి భయపడ్డాడు. బతికుంటే బలుసాకు తినవచ్చునని నిర్ణయించుకున్నాడు. వెంటనే వెనక్కి తిరిగి మేనత్త ఇంటికి వచ్చేశాడు.

మేనత్త ఇంటికి చేరిన సుబ్బారావు బతికి ఉండడంచేత అనుకున్న ప్రకారం బలుసాకులు తినాలనుకున్నాడు. బలుసాకుల కోసం ఇల్లంతా గాలించాడు. అతనికి ఎక్కడా బలుసాకులు దొరకలేదు. మరదలుకూడా ఇంట్లో లేకపోవడంతో ఆమె బలుసాకులు తీసుకొని పారిపోయి ఉంటుందని ఆలోచిస్తుండగా, అతని చెంపమీద మళ్ళీ దోమ వాలింది. ఈసారి వాలి ఊరుకోలేదు. గట్టిగా కాటేసింది. దానితో సుబ్బారావు చెయ్యి అతనికి తెలియకుండానే అతని చెంప ఛెళ్ళుమనిపించింది.

చెంప ఛెళ్ళుమనటంతో సుబ్బారావు బుర్ర పని చేయడం మొదలు పెట్టింది. అంతకు ముందు అతని చెంపమీద మరదలు ఎందుకు కొట్టిందో తెలిసి వచ్చింది. తెలిసి చాలా బాధ పడ్డాడు. తన అవివేకానికి సిగ్గు పడ్డాడు. తొందరపాటు నిర్ణయాలు ఎంత దారుణానికి దారి తీస్తాయో తెలుసుకున్నాడు. బాధతో అతని చేతులు కాలయి కానీ, ఆకులు దొరక్క తల పట్టుకున్నాడు.

సుబ్బారావు ఇలా ఉండగా, అతని మరదలు సముద్రాన్ని సమీపించింది. అదే సమయంలో దూరంగా కొండమీద ఓ సినిమాహీరో నిలబడి ఉన్నాడు. దూరంనుంచే ఆమెను గమనించసాగాడు. ఆమె సముద్రంలోకి దూకగానే డైరెక్టరుగారి ఆజ్ఞతో అక్కడనుంచే అమాంతం దూకేశాడు.

అరగంట సేపు సముద్ర కెరటాలతో హోరా

హెూరీ పోరాడి, అతి కష్టం మీద ఆమెను ఒడ్డుకు చేర్చాడు. తరవాత ఆమెను అక్కడే ఇసుక తిప్పలో వెల్లకిలా పడుకోబెట్టాడు. డైరెక్టరుగారు ఆమె పమి టను పక్కకు లాగి ఫొటోగ్రాఫర్‌ని పిలిచారు. ఫొటోగ్రాఫరుకి డైరెక్టరుగారి చేష్టలు అర్థం కాలేదు. అయినా, తన విధిని సక్రమంగా నిర్వర్తించాడు.

డైరెక్టరుగారు చెప్పినట్లుగానే హీరో ఆమె పొట్ట నొక్కి నీళ్ళన్నీ కక్కించాడు. అప్పుడు ఆమెకి తెలివి వచ్చి కళ్ళు తెరిచింది. ఎదురుగా ఉన్న హీరోని చూసి "నన్నెందుకు రక్షించారు?" అని ప్రశ్నించింది. ఆ ప్రశ్నకు హీరో ఆమెను "తుఫాను సమయంలో సముద్రంలోకి వెళ్ళకూడదని ఆకాశ వాణి హెచ్చరించలేదా?" అని అడిగాడు.

"తుఫాను సమయంలో బెస్తవారు సముద్రంలో కి వెళ్ళకూడ దన్నారు కానీ, నన్ను కాదు" అంది సుబ్బారావు మరదలు. ఆమె మాటలకు హీరో మారు మాట్లాడలేదు. ఆమెను తన ఇంటికి తీసుకు ని వెళ్ళాడు. వెంటనే దినపత్రిక లన్నింటికీ ఉత్తరా లు వ్రాశాడు.

తుఫాను సమయంలో ఆకాశవాణి హెచ్చరికలో మార్పులు చేయవలసిందిగా హీరో వ్రాసిన ఉత్తరం వార్తలలో సంచలనం సృష్టించింది. చాలా మంది శ్రోతలు, పాఠకులు అతని అభిప్రాయాన్ని బలపరిచారు. దానితో ఆకాశవాణి అధికారులు భయపడిపోయారు. తుఫాను హెచ్చరికలో మార్పు లు చేశారు.


"తుఫాను సమయంలో బెస్తవారే కాకుండా ఇతరులుకూడా సముద్రంలోకి వెళ్ళరాదు" అని ఆకాశవాణి తుఫాను హెచ్చరికలో మార్పు చేయడా నికి అసలు కారణభూతు లెవరో సుబ్బారావు తెలుసుకున్నాడు. పత్రికల ద్వారా హీరో చిరునా మా సంపాదించి, తుఫాను హెచ్చరికలో మార్పు చేయాలనే తలంపు హీరోకి ఎలా కలిగిందో తెలియ జేయవలసిందిగా అతనికి ఉత్తరం వ్రాశాడు. సినిమాహీరో ఫ్లాష్‌బాక్‌లో జరిగిన కథ వివరించాడు.

ఒక అమ్మాయి ఆత్మహత్యా ప్రయత్నం మూ లంగా ఆకాశవాణి తుఫాను హెచ్చరికలో మార్పు వచ్చిందని ఎట్టకేలకు తెలుసుకున్న సుబ్బారావు ఆ అమ్మాయిని పెళ్ళి చేసుకోవడానికి నిర్ణయించు కున్నట్లు సినిమాహీరోకి తిరిగి ఉత్తరం వ్రాశాడు.

సుబ్బారావు కోరిక ప్రకారం హీరో సుబ్బారావుకీ అతని మరదలికీ పెళ్ళి చూపులు ఏర్పాటు చేశా డు. పెళ్ళిచూపుల్లో సుబ్బారావూ, అతని మరద లూ ఒకర్ని ఒకరు చూసుకొని ఆశ్చర్యపోయారు. సుబ్బారావు మరదలు వెంటనే లేచి వచ్చి "బా వా!" అంటూ ఒక్క అంగలో సుబ్బారావును వాటేసుకొంది.

అలా వాటేసుకోవడంలో ఆమె రెండు చేతులూ సుబ్బారావు పీక నొక్కేశాయి. దానితో సుబ్బారావుకి ఊపిరి అందడం కష్టమై ఆమె చేతుల్ని ఒక్క సారిగా విసురుగా ఆవలకి నెట్టి, అదే సమయంలో "నన్ను క్షమించు, మరదలా!" అన్నాడు, జరిగిన పొరపాటుకి క్షమాపణ వేడుకొంటూ.

అయితే, ఈసారి సుబ్బారావు మరదలు అతణ్ణి అపార్థం చేసుకొంది. అతడు ఆమె రెండు చేతు ల్ని విసురుగా నెట్టడం, క్షమించమనడం చూసి



ఆమెపై అతనికి ఇంకా కోపం తగ్గలే దనుకుంది. వెంటనే ఆమెకికూడా కోపం వచ్చేసింది. మూతి ముడిచి అతణ్ణి నానా మాటలూ తిట్టి బయటకు వెళ్ళిపోబోయింది. కానీ. వెంటనే సుబ్బారావు ఆమె చెయ్యి పట్టుకొని ఆపి. ఆమె చెంపమీద అయిదు వేళ్ళ ముద్ర వేశాడు.

సుబ్బారావు మరదలి చెంపమీద కొట్టిన దెబ్బ ఆమె గూబ గుయ్యిమనిపించింది. గతంలో సుబ్బారావు చెంపమీద దోమ వాలినప్పుడు దాన్ని చంపడానికి ఆమె కొట్టిన దెబ్బ ఆమె కళ్ళ ముందు సినిమా రీళ్ళలా తిరిగి సెకండ్ షోకి సిద్ధమయింది. అప్పటికి గానీ ఆమెకి తెలిసి రాలేదు సెకండ్ షోకి సమయ మయిందని. వెంటనే తన బావ చెయ్యి పట్టుకొని సెకండ్ షోకి లాక్కుపోయింది.

సినిమాచూసి బావా మరద ళ్ళిద్దరూ హీరో దగ్గర సెలవు తీసుకొని రైలుకి టైము కావటంతో స్టేషన్‌కి బయల్దేరారు. స్టేషన్‌లో రైలు రెండు నిమిషాలు ఆగి వాళ్ళిద్దర్నీ ఎక్కించుకొని వాళ్ళ ఇంటి దగ్గర దింపి ఏమయిపోయిందో కనిపించ లేదు.

ఇంటికి చేరగానే సుబ్బారావు మరదలితో సహా తల్లి కాళ్ళమీద పడ్డాడు. ఎందుకంటే. అతని కాలికి గడప తగిలింది. ఆ దెబ్బతో ముందుకు పడబోయి మరదల్ని పట్టుకున్నాడు. కానీ. ఆమె కూడా అనుకోని ఆ సంఘటనకు తమాయించుకోలేక పోయింది. అందుచేత ఆ ఇద్దరూ కలిసి ఒకేసారి సుబ్బారావు తల్లి కాళ్ళమీద పడ్డారు.

వాళ్ళు అలా పడగానే సుబ్బారావు చెల్లెలు వాళ్ళిద్దరూ ఆశీర్వాదం కోసం తల్లి కాళ్ళమీద పడ్డారనుకొంది. వెంటనే "ఆగండి" అంటూ పరుగు పరుగున వచ్చి తల్లిని దూరంగా లాగి. "నా పెళ్ళి కాకుండానే మీరు పెళ్ళి చేసుకొని మీ దారి మీరు చూసుకుందా మనుకున్నారా?" అని నిలదీసి అడిగింది.

చెల్లెలు పైకి నిలదీసి వదిలి పెట్టిన చొక్కా కాలరు సవరించుకుంటూ సుబారావు చెల్లెలితో "నీ పెళ్ళికి ఇప్పుడేం తొందర వచ్చిందే?" అన్నాడు కొంచెం చిరాగ్గా. ఆ మాటకు సుబ్బారావు చెల్లెలు ఏడుపు ముఖం పెట్టి. "ఊఁ...ఊఁ... నాకు ఇప్పుడే పెళ్ళి చేయాలి" అంటూ ఏడుపు మొదలు పెట్టింది.

ఆమె ఏడుపు చూసి సుబ్బారావు మరదలి గుండె తరుక్కుపోయింది. అది చూసి సుబ్బారావు బాధ పడిపోయాడు. మరదల్ని వెంటనే ఆసుపత్రికి పదమన్నాడు. ఆమె గుండె తరుక్కోని పోకుండా ఆపడానికి మరదలు ఒప్పుకోలేదు. పైపెచ్చు. ఆమె సుబ్బారావుతో. "పోనీలే. బావా! ఏదో చిన్న పిల్ల-ఏడుస్తోంది. ముందు ఆమె పెళ్ళి చేసి ఆ తరవాత మనం చేసుకుందాం" అంది గోముగా.

సుబ్బారావు మరదలిమీద మండి పడ్డాడు. "నీకేమన్నా మతి ఉందా? ఈ రోజుల్లో ఆడపిల్ల పెళ్ళి చేయడమంటే మాటలా! ఎంత డబ్బు కావాలి?" అన్నాడు మరదలితో. ఆ మాటకు "ఓసి. ఇంతేనా! మానాన్నని అడిగి ఎంత డబ్బు ఖర్చయినా నేను భరిస్తాను. ముందు ఆమెకు మంచి సంబంధం చూడు. బావా!" అంది మరదలు తేలిగ్గా.

సుబ్బారావు ఒప్పుకోలేదు. కట్నం తీసుకోవడం తనకు ఇష్టం లేదన్నాడు. "పోనీ. నేను సంపాదించి ఇస్తాను" అంది మరదలు. అయినా. అతను ఒప్పుకోలేదు. తన స్వయం సంపాదనతోనే చెల్లెలి పెళ్ళి చేస్తానన్నాడు. అయితే. ఈలోగా తను మాత్రం పెళ్ళి చేసుకోకుండా ఉండలేనన్నాడు.

సుబ్బారావు మరదలు ఒప్పుకోలేదు. ఏమైనా సరే. ఆడపడుచు పెళ్ళి తరవాతనే తన పెళ్ళి అని ఖచ్చితంగా అక్కడే ఉన్న బల్ల గుద్ది మరీ చెప్పింది. ఆ దెబ్బతో బల్ల విరిగిపోయింది. పెద్ద చప్పుడయింది. ఆ చప్పుడుకి సుబ్బారావు తండ్రి పరుగు పరుగున అక్కడికి చేరుకొని జరిగింది చూశాడు. ఆ బల్ల తిరిగి బాగు చేయించమని మేనకోడలి మొహంమీద నిర్మొహమాటంగా చెప్పేశాడు.

సుబ్బారావు మరదలు అదరలేదు. బెదరలేదు. నిండుకుండ మాదిరి తొణక్కుండా అలాగే ఉండి భుజంమీద వేలాడే వేనిటి సంచీ తెఱచి డబ్బు తీసింది. "నువ్వింత డబ్బు మనిషి వనుకోలేదు" అంటూ నోట్ల కట్టల్ని లెక్క పెట్టకుండానే మేనమామ ముఖాన కొట్టింది. ఆ దెబ్బతో సుబ్బారావు తండ్రి నోరు మూశాడు. ఆమెను. గదిలోకి లాక్కుపోయి తలుపులు వేశాడు. బయట గడియ పెట్టి ఆయన పోలీసు స్టేషన్‌కి వెళ్ళాడు. ఎందుకంటే. ఆయన చేసే ఉద్యోగం పోలీసు స్టేషన్‌లోనే కాబట్టి.

తండ్రి బయటకు వెళ్ళగానే సుబ్బారావు మరదలు ఉన్న గది తలుపు గడియ తీశాడు. ఈలోగా అతని చెల్లెలు చిందర వందరగా కింద పడి ఉన్న రూపాయ నోట్లు ఏరి వదినకు ఇచ్చింది. అయితే. ఆమె వాటిని తీసుకోలేదు. చిన్నగా నవ్వుతూ సుబ్బారావు చెల్లెలికే దాచుకోమని ఇచ్చేసింది. దానితో సుబ్బారావు చెల్లెలి ఆనందానికి అవధు ల్లేవు. 'మా వదిన చాలా మంచి'దంటూ వదిన బుగ్గమీద ముద్దు పెట్టింది.

ఇంతలో సినిమాహీరో అక్కడ ప్రత్యక్షమయ్యాడు. సుబ్బారావు చెల్లెల్ని చూసి ప్రేమలో పడ్డాడు. వెంటనే సుబ్బారావు చెల్లెలు అతణ్ణి పైకి లేపి దుమ్ము దులిపింది. ఆ పైన మంచినీళ్ళిచ్చింది.

హీరో నీళ్ళన్నీ గబగబా తాగేసి సుబ్బారావు చెల్లెల్ని చూసి గుటకలు మింగాడు. దానితో సుబ్బారావు చెల్లెలు సిగ్గు పడిపోయింది. పడిపోయిన సిగ్గును ఏరుకోవడానికి ఆమె కిందకి వంగింది.

అదే అదనుగా హీరో ఆమె మెడలో తాళి కట్టియబోయాడు. అంతలో సుబ్బారావు వచ్చి. "ఆగు" అన్నాడు గట్టిగా. అందరూ ఆశ్చర్యపోయారు.

సుబ్బారావు ఒక్క క్షణం లోపలికి వెళ్ళి తాళిబొట్టు తెచ్చి మరదలికి కట్టబోయాడు. అదే సమయంలో హీరో సుబ్బారావు చెల్లెలి మెడలో తాళి కట్టబోయాడు.

ఇంతలో "ఆగండి" అంటూ సుబ్బారావు తలిదండ్రులు సకుటుంబ బంధు మిత్ర సపరివారంగా అక్కడ ప్రత్యక్షమయ్యారు. అయినా. సుబ్బారావు. హీరో ఆగలేదు. క్షణం కూడా ఆలోచించకుండా తాళిబొట్లు కట్టేశారు. ఆ తరవాత నలుగురూ వచ్చి సుబ్బారావు తలిదండ్రుల కాళ్ళకు నమస్కరించారు. భజంత్రీలు మోగాయి. అక్షతలు పడ్డాయి. "శుభం" అన్నారు వెనకనుంచి ఎవరో.

సుబ్బారావు కథ విన్న తరవాత నాకో సందేహం వచ్చి సుబ్బారావుని అడిగేశాను- "మీ మరదలు చాలా కాలం పరాయి వాడి ఇంటి దగ్గర ఉంది కదా! మరి మీరు ఎలాంటి అగ్ని పరీక్ష పెట్ట లేదేమిటి?" అని నే నడిగిన ప్రశ్నకి సుబ్బారావు సీరియస్‌గా ముఖం పెట్టి "నాకు బూడిదే మిగులుతుంది కనక" అన్నాడు.

రెండు చేతులూ జోడించి ఓ నమస్కారం పడేసి అక్కడనుండి బయట పడ్డాను.

